
క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి వస్తువుల సమర్పణ


స్వామికి వెండి వస్తువులు సమర్పిస్తున్న రాంబాబు దంపతులు

మామిడికుదురు: మొగలికుదురులోని జగ్గన్న పేటలో వేంచేసిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి దొంగ రాంబాబు, దుర్గాభవాని దంపతులు మంగళవారం వెండి వస్తువులు సమర్పించారు. రూ.25 వేలు విలువైన వెండి పళ్లెం, దీపపు కుందులను ఆలయ ధర్మకర్త బిళ్ల భద్రాజుకు అందజేశారు. ఈ వెండి వస్తువులకు సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వాటిని స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా దాతను స్థానికులు అభినందించారు.

మాచవరంలో..

అంబాజీపేట: శ్రావణ మంగళవారంను పురస్కరించుకుని మాచవరంలో వేంచేసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు మాచరి నూరిబాబు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వరునికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

టీటీడీ నిధులతో రామాలయం నిర్మాణం


గోగన్నమఠంలో నూతనంగా నిర్మించిన రామాలయం

మామిడికుదురు: గోగన్నమఠంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయం రూ.10 లక్షలతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మణ హనుమ సీత సమేత శ్రీసీతారామ స్వామి వారి ఆలయం నిర్మించారు. ఈ ఆలయ విగ్రహ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఉదయం 11.19 గంటలకు జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ మంగళవారం తెలిపింది. యాలంగి కృష్ణ, ఈశ్వరి దంపతులతో ఈ ఆలయ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కమిటీ కోరింది.

ఎమ్మెల్యే రాపాక సేవలు అభినందనీయం


లక్కవరంలో కేక్ కట్ చేసి పంచుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మలికిపురం: రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు నియోజకవర్గ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. రాపాక పుట్టినరోజు వేడుకలను లక్కవరంలో మంగళవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఇజ్రాయిల్ కట్ చేసి పంచారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నేతృత్వంలో నియోజకవర్గంలో సంక్షేమ పాలన నడిపిస్తుందన్నారు. నాయకులు కొడవటి దొరబాబు, యాండ్ర రాంబాబు, పెమ్మాడి సోమరాజు, సోమిశెట్టి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ఆలమూరు: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని తమిళనాడు సీఎం స్టాలిన్ కుమారుడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడపాటి లక్ష్మణరావు తీవ్రంగా ఖండించారు. పెదపళ్ల బ్రాహ్మణ సంఘ కమ్యూనిటీ హాలులో బ్రాహ్మణ సంఘ నాయకులతో కలసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సనాతన ధర్మం యావత్ ప్రపంచానికి తలమానికంగా ఉందన్నారు. అలాంటి ధర్మాన్ని మంత్రి హోదాలో ఉండి అవహేళన చేయడం బాధాకరమన్నారు. కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఆయన చేసిన వ్యాఖ్యల తక్షణమే వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు.

తమలపాకు సాగులో మెళకువలు పాటించాలి

పి.గన్నవరం: తమలపాకు సాగులో మెళకువలు పాటించాలని వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ నాగలక్ష్మి, అపర్ణ, సునీతలు రైతులకు సూచించారు. మండలంలోని నాగుల్లంక గ్రామంలో మంగళవారం వారు రైతులతో సమావేశం నిర్వహించారు. తోటలను పరిశీలించి, పలు సూచనలిచ్చారు. స్వర్ణకపూరి తమలపాకు రకం ప్రాముఖ్యతను వివరించారు. తెగుళ్లు, వాటి నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

సమాజ ప్రగతికి రథసారథులు గురువులు

- ఘనంగా గురుపూజోత్సవం
- ఉపాధ్యాయులకు సత్కారం


సఖినేటిపల్లి మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద డాక్టర్ సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ


చెముడులంకలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయుడ్ని సత్కరిస్తున్న తమ్మన తదితరులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురుపూజోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలమూరులోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓలు పి.షాలెంరాజు, పి.సుబ్బరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ పితామహుడు, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చెముడులంకలోని ఎస్‌టీఎస్ఎన్ఎం జెడ్పీ హైస్కూల్‌లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు నేతృత్వంలో గ్రామస్తులు ప్రధానోపాధ్యాయుడు శివరామ్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి మెమొంటోలు బహూకరించారు.అలాగే మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లు గురుపూజోత్సవ వేడుకలను అట్టహాసంగా జరుపుకొన్నారు. చెముడులంకలోని శ్రీషిర్డీసాయి విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్ టి.ఉమారాణి ఆధ్వర్యంలోను, సిద్ధార్థ హైస్కూల్‌లో కరస్పాండెంట్ కె.ముల్లారావు ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలు జరిగాయి. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్ విద్యార్థులు రూ.80 వేలతో సమకూర్చిన డైనింగ్ టేబుల్స్‌ను విద్యార్థులకు అందించారు.

సఖినేటిపల్లి: ఎంఈవో కార్యాలయంలో మంగళవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంపీపీ వీరా మల్లిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈవో–1, 2 డి.కిషోర్‌కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సఖినేటిపల్లిలో రిటైర్డ్ టీచర్, లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ నల్లి ప్రేమానందంను శిష్యులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఆరిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబాజీపేట: సమాజ ప్రగతికి గురువులు రథసారథులని, తల్లితండ్రుల తరువాత గురువే దైవమని సర్పంచ్ కోట బేబిరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్ అన్నారు. చిరతపూడి జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుండి విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తూ, వారిని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఉపాధ్యాయులదే కీలక పాత్ర అన్నారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. గిడుగు రామమూర్తి జయంతిని, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, సామెతల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వైస్ ఎంపీపీ నాగరాజు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ దారపురెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఉపాధ్యాయులను సమాజం ఎన్నటికీ మరువదని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. స్థానిక సాయితేజ విద్యాసంస్థల అధినేత అన్నాబత్తుల అనుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో వారు పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంపీటీసీ దానరి మౌనిక, హెచ్ఎం సుంకర వెంకటకృష్ణ, ప్రిన్సిపల్ కడలి కొండబాబు తదితరులు పాల్గొన్నారు. పి.గన్నవరం గ్రేస్ విద్యాసంస్థల డైరెక్టర్ నల్లి చరణ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సర్పంచ్ బొండాడ నాగమణి, ప్రిన్సిపల్స్ పీవీఆర్ నాయుడు, అన్నాబత్తుల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు గంధ్రోతు పుల్లపరాజును సర్పంచ్ వడలి కొండయ్య, ఎంపీటీసీ పులవర్తి రాజారావు చేతుల మీదుగా దుశ్శాలువాలతో సత్కరించారు.

కొత్తపేట: భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని స్థానిక కాంతి భారతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో, కాంతిభారతి కరస్పాండెంట్ టి.సత్యవాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథులుగా, ఎంఈఓలు ఎం.హరి ప్రసాద్, కె.లీలావతి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు బత్తుల జయశ్రీ, అజ్జరపు సత్యం, సాదే సత్యనవోమణి రోజ్, శెట్టి కనకదుర్గాప్రసాద్, నల్లా సత్యనారాయణమూర్తి, మారిశెట్టి సత్యనారాయణలను అతిథుల చేతుల మీదుగా పూలమాల, నూతన వస్త్రాలు, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు వివిధ బహుమతులు అందజేశారు. స్థానిక ప్రియదర్శినీ బాలవిహార్‌లో కరస్పాండెంట్ ఏటీసీ దేవ్ ఆధ్వర్యంలో సర్వేపల్లి జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.

ఆత్రేయపురం: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఉత్సవాలను మంగళవారం మండలంలో పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ విద్యాసంస్థల్లో గురుపూజోత్సవం నిర్వహించారు.


చిరతపూడిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ, సొసైటీ చైర్మన్, విద్యార్థులు


పోతవరం ఎంపీపీ పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న దృశ్యం


కొత్తపేట కాంతిభారతిలో రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ రమాదేవి, తోట దంపతులు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం


అంబాజీపేటలో జరిగిన తైక్వాండో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

అంబాజీపేట: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఒత్తిడి జయించి మానసికోల్లాసానికి దోహదపడతాయని హెచ్ఎం కె.సాయిరామ్ అన్నారు. జాతీయ క్రీడా వారోత్సవాలను పురస్కరించుకుని కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో తైక్వాండో పోటీలను మంగళవారం నిర్వహించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, తైక్వాండో చీఫ్ కోచ్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో 10 రకాల కేటగిరిలలో తైక్వాండో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేస్తారన్నారు. తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు, పి.భార్గవిశ్రీకర్, పి.భూషణం, న్యాయనిర్ణేతలుగా పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, గంగాధరరావు వ్యవహరించారన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

అట్టహాసంగా రవీదేవి ప్రమాణ స్వీకారం

అవిడి నుంచి కొత్తపేటకు భారీ ఊరేగింపు


కొత్తపేటలో భారీ గజమాలతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, చైర్మన్ రవీదేవి దంపతులకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు, అభిమానులు


కొత్తపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రెడ్డి రవీదేవి ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం అవిడి సర్పంచ్ రెడ్డి చంటి సతీమణి రవీదేవికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. మండలంలోని అవిడి గ్రామంలో వారి స్వగృహం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి తదితర నాయకులతో రెడ్డి రవీదేవి–చంటి దంపతులు ఎక్కగా వారి వాహనానికి ముందు వందలాది బైక్‌లు, వెనుక కార్లు వెంట రాగా తీన్‌మార్, గారడీ వాయిద్యాలు, భారీ బాణసంచా కాల్పుల నడుమ భారీ ఊరేగింపుగా బయలుదేరారు. ద్యామ్ సెంటర్, అవిడి సెంటర్, అవిడి రేవు, ఐండ్రిగ, పలివెల, కొత్తపేట కౌశికరోడ్డు, పంచాయతీ రోడ్డు మీదుగా ఊరేగింపు సాగగా వారికి అడుగడుగునా ప్రజలు పూలమాలలు, గజమాలలు వేసి బ్రహ్మరథం పట్టారు. పాతబస్టాండ్ సెంటర్‌లోఎమ్మెల్యే జగ్గిరెడ్డి, చంటి–రవీదేవి దంపతులకు క్రేన్ సాయంతో భారీ గజమాలతో ఘనస్వాగతం పలికారు. అక్కడ బీఆర్ అంబేడ్కర్, వైఎస్ రాజశేఖరరెడ్డి, జ్యోతీరావుపూలే, వంగవీటి రంగా విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మెయిన్‌రోడ్డు గుండా శ్రీకరి శుభకరి కల్యాణ మండపానికి చేరుకున్నారు. ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో అతిథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలు, శాలువాలతో చైర్మన్ రవీదేవి, చంటి దంపతులను ఘనంగా సత్కరించారు.

పింఛన్లతో ఆర్థిక భద్రత


మలికిపురంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: గ్రామాలలో నిరుపేదలకు, అర్హులకు, వితంతువులకు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ ద్వారా వారికి ఆర్థిక భద్రత లభిస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలో కొత్తగా మంజూరైన 240 పింఛన్‌లను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పింఛన్‌లను రూ.2750కి పెంచిన ఘనత సీఎం జగన్‌దేనని ఆయన అన్నారు. అంతేకాక అర్హులకు దరఖాస్తు చేసుకున్న వెంటనే పింఛన్లను ఇస్తున్న ప్రభుత్వం కూడా తమదేనని అన్నారు. గత ప్రభుత్వాలు పింఛన్ ఇవ్వాలంటే ఆ పార్టీల నాయకుల చేతులు తడవాల్సిందేనని అన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా నెల ఒకటో తారీఖునే లబ్ధిదారులకు పింఛన్లను ఇంటికి వెళ్లి అందిస్తున్న ప్రభుత్వం కూడా తమదేనని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామి నాయుడు వివిధ గ్రామాల సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంబటి భూలక్ష్మి

పి.గన్నవరం: గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులను టీడీపీ, జనసేన ప్రజా ప్రతినిధులు ఉన్న గ్రామాలకు ఇవ్వడం లేదని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులను నిలదీశారు. ఆయా గ్రామాల్లో ఉన్న నాయకులను తీసుకురమ్మంటున్నారని ఆరోపించారు. ఎంపీడీఓ ఎం.భారతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమాఖ్యల అధ్యక్షులు తోలేటి బంగారునాయుడు, ఆదిమూలం సూరయ్యకాపు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నేలపూడి దామోదర్, పాలూరి వీరభద్రం, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు


విశాఖలో మంత్రి బొత్స చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న కంభంపాటి


అమలాపురంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకుంటున్న శ్రీరామచల్లమ్మ



ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న వీరరాఘవరావు, భాస్కరరెడ్డి



కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ప్రభావతి, నిర్మలకుమారి

మామిడికుదురు/ఆలమూరు/రాజోలు/ఆత్రేయపురం/కొత్తపేట: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా గోగన్నమఠం యూపీ స్కూల్ ఉపాధ్యాయిని రామాయణం శ్రీరామచల్లమ్మ, మామిడికుదురు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కొమ్ముల వీరరాఘవరావు, ఆలమూరు మండలం చిలకలపాడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.భాస్కర్‌రెడ్డి, రాజోలు మండలం పొన్నమండ–3 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అల్లూరి శ్రీరామకృష్ణంరాజు, ఆత్రేయపురం మండలం రాజవరం ప్రధాన ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు బి.రాజ్‌కుమార్, ర్యాలి నంబర్–1 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని గోపిశెట్టి లక్ష్మీ సుజాత, కొత్తపేట మండలం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి కొత్తపల్లి ధర్మరాజు, కడలివారిపాలెం ఎంపీపీ పాఠశాల నుంచి పేకేటి సత్యవతి, మందపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బొక్కా నాగేశ్వరరావు, సఖినేటిపల్లి మండలానికి చెందిన ఇద్దరు మహిళా టీచర్లు మంగళవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిలుగా పురస్కారాలు అందుకున్నారు. సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని తెలుగు పండిట్ గుండేపల్లి ప్రభావతి, ప్రాథమిక పాఠశాలల స్థాయిలో సఖినేటిపల్లిపాలెం ఎలిమెంటరీ పాఠశాల టీచర్ ఎం.నిర్మలకుమారి మంగళవారం అవార్డులు అందుకున్నారు. అలాగే అమలాపురంలో జరిగిన గురుపూజోత్సవ సభలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, టీచర్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, డీఈఓ ఎం.కమలకుమారి చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. దీనిలో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయులకు షీల్డులు అందించి, శాలువాలతో సత్కరించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న వారికి ఆయా మండలాల ఉపాధ్యాయులు, ఎంఈవోలు అభినందించారు.




కొత్తపల్లి ధర్మరాజు, పేకేటి సత్యవతి, బొక్కా నాగేశ్వరరావులను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న శ్రీరామచంద్రరాజు, ఉపాధ్యాయులు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న 'కంభంపాటి'

పి.గన్నవరం: నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కంభంపాటి సూర్యనారాయణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో మంగళవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా కంభంపాటి ఈ అవార్డును అందుకున్నారు.

రోహిత్ నిజాయితీ

ఆలమూరు: ఏటీఎంలో దొరికిన సొమ్మును స్వార్థానికి వినియోగించుకోకుండా పోలీసులకు అప్పగించిన చాపల రోహిత్ తన నిజాయితీని నిరూపించుకున్నాడు. ఆలమూరుకు చెందిన రోహిత్ నగదును విత్‌డ్రా చేసుకునేందుకు మెయిన్‌రోడ్డులోని ఏటీఎం వద్దకు మంగళవారం వెళ్లాడు. అప్పటికే ఆ ఏటీఎం మెషీన్‌లో రూ.తొమ్మిది వేలు బయటకు వచ్చి ఉన్నాయి. తనది కాని నగదును బాధితులకు అప్పగించాలన్న సదుద్దేశంతో ఆ నగదును నేరుగా తీసుకువెళ్లి ఆలమూరు పోలీసులకు రోహిత్ అప్పగించాడు.

టేబుల్, రెండు బీరువాల బహూకరణ

అయినవిల్లి: మండలంలోని మాగాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన వేగేశ్న శివశేఖరరాజు (శివబాబు) రూ.30 వేలు విలువైన టేబుల్, రెండు బీరువాలను మంగళవారం అందజేశారు. ఈ ఫర్నిచర్‌ను పాఠశాల ఆఫీసు కార్యాలయంలో రికార్డులు భద్రపరచుకోవాలని దాత సూచించినట్లు తెలిపారు. దాతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.శరభరాజు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వర్గీకరణకు మద్దతుగా లేఖ రాయాలని వినతి

మామిడికుదురు: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాయాలని ఎమ్మార్పీఎస్ నేతలు రాజోలు మండలం తాటిపాకలో మంగళవారం మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును కలసి వినతిపత్రం ఇచ్చారు. మహాజన నేత మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఈ వినతిపత్రం ఇచ్చామని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ పేర్కొన్నారు. టీడీపీ అధిష్టానం ద్వారా వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టే విధంగా చొరవ చూపాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు సిద్రా శ్రీనివాసరావు, లూటుకుర్తి శ్రీనివాస్, బొంతు సుధాకర్, ఉండ్రాజవరపు శివ, ఆకుమర్తి ఏడుకొండలు, ముస్కూడి జగదీష్, కనపాల స్వామి, తాతపూడి గణేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు నిరుపమానం

ఆత్రేయపురం: అంగన్‌వాడీ ఉపాధ్యాయుల సేవలు నిరుపమానమని ప్రముఖ ఇంద్రజాలికుడు చింతా శ్యామ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద భారత టాలెంట్ అసోసియేషన్, అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవం నిర్వహించారు. ప్రముఖ ఇంద్రజాలికుడు శ్యామ్‌కుమార్ పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం 22 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలతో కప్పి మెమెంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

భారత్ జోడో యాత్రను విజయవంతం చేయాలి

మామిడికుదురు: అమలాపురంలో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే భారత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ సంగీత సత్యనారాయణ కోరారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో మంగళవారం జరిగిన సభకు మండల శాఖ అధ్యక్షుడు గెద్దం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పార్టీ యువనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి ఏడాది పూర్తైన సందర్భంగా ఆ యాత్రకు మద్దతుగా జోడో యాత్ర చేపడుతున్నామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు చేపడుతున్న ఈ యాత్రకు పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

రాజోలు: రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ రమాదేవి మంగళవారం తెలిపారు. రాజోలు మండలం చెన్నడం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త ఒక పోస్టు (ఎస్సీ), అంగన్‌వాడీ సహాయకురాలు బి.సావరం (బీసీ–బీ), కూనవరం(ఎస్సీ), సఖినేటిపల్లి మండలం మోరిపోడు ముప్పర్తివారిపాలెం (బీసీ–డీ) పోస్టులకు ఆయా గ్రామాలకు చెందిన వివాహితలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 7 నుంచి 16 వరకు దరఖాస్తులను రాజోలు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అందజేయాలన్నారు.

వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం

ఆలమూరు: గ్రామంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విక్రమ భట్టేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రావాడ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో ఈనెల ఐదు నుంచి ఏడు వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా బ్రహ్మశ్రీ కాళ్ళకూరి దుర్గాప్రసాద్ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు కాళ్లకూరి సూరిపండు, వెలవలపల్లి చైతన్య కృష్ణ మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు, హోమాలు ప్రారంభించారు. ఈ పూజల్లో రావాడ సత్తిబాబు, రావాడ నరేష్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల ఏడున స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించేందుకు వేద పండితులు శుభ ముహూర్తంగా నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు.

వెటర్నరీ అసిస్టెంట్ కృష్ణ మృతి


కృష్ణ (ఫైల్)

ఆత్రేయపురం: గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ అంకం కృష్ణ (42) సోమవారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందాడు. పేరవరం గ్రామానికి చెందిన అంకం కృష్ణ భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కృష్ణ మృతికి గ్రామస్తులు, పలువురు సంతాపం వ్యక్తం చేశారు.